చాకర్లపల్లి స్టేషన్‌లో సమస్యల తిష్ట



చాకర్లపల్లి రైల్వే స్టేషన్



శిథిలావస్థలో టికెట్ కౌంటర్


పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

- ప్రారంభానికి నోచుకోని రైల్వేస్టేషన్
- శిథిలావస్థలో టికెట్ కౌంటర్
- ఆధునికీకరణ పేరిట సాగుతున్న పనులు
- రైలు నిలపకపోవడంతో ప్రయాణికుల అవస్థలు

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభానికి నోచుకోక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. చాకర్లపల్లి రైల్వే స్టేషన్ మూత పడి దాదాపు ఎనిమిదేళ్లు కావస్తోంది. ఆధునికీకరణ పేరిట ఏళ్ల తరబడి పనులు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో బెంగళూరు, అనంతపురం వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
రైల్వే స్టేషన్ రోడ్డు పక్కనే ఉండడంతో సోమందేపల్లి మండలంతోపాటు పెనుకొండ, గోరంట్ల, మండలాల నుంచి కూడా ప్రయాణికులు బస్సుల ద్వారా వచ్చి రైలు ఎక్కడానికి ఆసక్తి చూపేవారు. అయితే సమీపంలో రంగేపల్లి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి చాకర్లపల్లి స్టేషన్‌ను రైల్వే అధికారులు బంద్ చేశారు. స్థానికుల నుంచి వినతిపత్రాలు రైల్వే శాఖకు వెళ్లడంతో యథాతథంగా చాకర్లపల్లి రైల్వే స్టేషన్ పునః ప్రారంభం కోసం చర్యలు చేపట్టారు. కానీ పనులు మందకొడిగా సాగుతుండగా ఏళ్లతరబడి రైల్వే ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. గతంలో బెంగళూరు, గుంతకల్లు, గుంటూరుకు వెళ్లే రైలు ఆపుతుండడంతో స్టేషన్‌కు టికెట్ల ద్వారా ఆదాయం వచ్చేది. ప్రస్తుతం సోమందేపల్లికి నాలుగు కిలోమీటర్ల దూరంలో రంగేపల్లి రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ అక్కడికి రాకపోకలు జరపడానికి ఇబ్బందులు ఉన్నాయి.

శిథిలావస్థలో భవనాలు

స్టేషన్‌లో నూతన భవనాలు నిర్మించి 10 ఏళ్లు అవుతోంది. కానీ 2018లో స్టేషన్ మూత పడగా, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, టికెట్ బుక్కింగ్ కౌంటర్, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. వాటి పర్యవేక్షణ లేకోవడంతోనే ఆ దుస్థితి నెలకొంది. ప్రస్తుతం అనధికారికంగా రెండు రైళ్లు ఆపుతున్నప్పటికీ టికెట్లు ఇచ్చేవారు లేరు. మరో ప్లాట్ ఫారం నుంచి దిగి ప్రయాణికులు బయటకు రావాలంటే మహిళలు, పిల్లలు, వృద్ధులు పట్టాలు దాటాల్సిన పరిస్థితి ఉంది.

ఎంతో సౌకర్యంగా ఉండేది



రోడ్డు పక్కనే స్టేషన్ ఉండడంతో బస్సుల ద్వారా స్టేషన్ వద్ద దిగి రైలు ప్రయాణం చేసే వాళ్లం .కానీ స్టేషన్ బంద్ కావడంతో ప్రాయణికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వినియోగంలోకి తీసుకువస్తే బాగుంటుంది.

– హరిప్రసాద్, సోమందేపల్లి

పనులు త్వరగా పూర్తి చేయాలి



రైల్వే స్టేషన్ వద్ద ప్లాట్ ఫారం బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి. టికెట్ కౌంటర్ కూడా ప్రారంభించాలి. గతంలో రైతు ప్రమాణం పేద, మధ్య తరగతి, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడేది. ఇప్పుడు రంగేపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కాలంటే నాలుగు కిలోమీటర్లు దూరం వెళ్లాలి. ప్రయాణ సౌకర్యం లేదు. ఆటోలు కూడా అందుబాటులో ఉండవు. చాకర్లపల్లి స్టేషన్ ప్రారంభం అయితే సౌకర్యంగా ఉంటుంది.

– వడ్డి చంద్రశేఖర్, సోమందేపల్లి

మృతుడి కుటుంబానికి పరామర్శ


బాధిత కుంటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: మండలంలోని నాగలూరు గ్రామానికి చెందిన హరిజన గోపాలప్ప ఇటీవల చేపల వేటకు వెళ్లి మృతిచెందిన విషయం విదితమే. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషా శ్రీ చరణ్ శుక్రవారం ఉదయం నాగలూరు గ్రామానికి చేరుకొని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థికసాయం అందించి, వైఎస్సార్ సీపీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు బాబు,శ్రీ కాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

సోమందేపల్లి: మండల కేంద్రంలోని శివానగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వేణును నాయకులు శుక్రవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని, వేణు ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు రమాకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న మహిళలు

లేపాక్షి: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శుక్రవారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. తొలుత వాల్మీకి విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి


పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

మడకశిరరూరల్: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగాంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో గల పుస్తకాలను చదివి మేధస్సును పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

దోమల నివారణపై జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

మడకశిరరూరల్: గ్రామాల్లో దోమల నివారణ, సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ల్యాబ్‌లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మలేరియా, డెంగా, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందికి వ్యాధుల నివారణపై పలు సూచనలు, సలహాలను అందించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీఉల్లా, సూపర్‌వైజర్ రాంప్రసాద్, పాల్గొన్నారు.

పరిగి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా వ్యాధి నిర్మూలన ఇన్‌చార్జ్ అధికారి ఓబులు తెలిపారు. శుక్రవారం మండలంలో ఆయన పర్యటించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పర్యవేక్షించిన ఆయన పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

అమరాపురం: స్థానిక సొసైటీ కార్యాలయంలో సహకార సంఘం వారోత్సవాలు శుక్రవారం కార్యదర్శి మంజునాథ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీ పని చేస్తోందన్నారు. కార్యాలయంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కార్యాలయం ఆవరణలో జెండా ఎగురవేశారు.

పిల్లలపై నిఘా పెట్టాలి


సభలో మాట్లాడుతున్న సీఐ సురేశ్

పావగడ: తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ సురేశ్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల అవగాహన సభలో ఆయన మాట్లాడారు. పిల్లల్ని అతి గారాబంగా పెంచితే చెడు అలవాట్లకు లోనై రౌడీల్లా తయారవుతారని హెచ్చరించారు. అంతకు ముందు డీఎస్పీ రామచంద్రప్ప మాట్లాడుతూ తాలూకా లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధి లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని ఎస్ఐ ల కు సూచించారు. దళిత నాయకుడు హనుమంతరాయ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు జాగృతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దళిత నాయకులు సీకే తిప్పేస్వామి, పెద్దన్న తదితరులు సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సభ అనంతరం తాలూకా వ్యాప్తంగా ఉన్న పలువురు రౌడీ షీటర్ల పరేడ్ నిర్వహించారు. రూరల్ సీఐ గిరీశ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

హిందూపురం టౌన్: పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కేటాయింపుల్లో పెండింగ్ బకాయిలపై మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులకు రూ.12,600 కోట్లు అవసరం ఉండగా.. రూ.5,387.03 కోట్లు కేటాయించారన్నారు. జీఓ నంబరు 77ను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రద్దు చేస్తామని చెప్పి.. ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌బిల్లు రూ.100కి పెంచి నెలకు రూ.3,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపకులు లేక వర్సిటీలు వెలవెలబోతున్నాయన్నారు. చివరికి కోర్సులు ఎత్తివేస్తున్నారని గుర్తు చేశారు. 3,220 అధ్యాపక పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేటి వరకూ దానిపై మాట్లాడటం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, హుస్సేన్, రాజు, అఫ్రిద్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు


దొడ్డేరిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి

రొళ్ల: గ్రామాల్లో భూసమస్యల పరిష్కరం కోసమే రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం దొడ్డేరి సచివాలయ ఆవరణలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే సబ్ డివిజన్, కొత్తగా పట్టదారు పాసుపుస్తకం మంజూరు, మ్యూటేషన్ పెండింగ్ వంటి ఇతరాత్ర రెవెన్యూ సమస్యలు ఏమైన ఉంటే రైతులు సరైన ఆధారాలతో తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. పలువురు రైతులు భూ సమస్యలపై అర్జీలు సమర్పించారు.

భూ సమస్య పరిష్కారానికి కృషి

సోమందేపల్లి: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు. శుక్రవారం పందిపర్తి గ్రామంలో జరిగిన గ్రామ సభలో రైతులు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పట్ట దారుపాసుపుస్తకాలు, 1బీ, రేషన్ కార్డులు తదితర రెవెన్యూ సమస్యలను సంబంధించి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో అన్నపూర్ణ, గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, బాను తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

పెనుకొండ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం ఆయన్ను పలువురు ఉపాధ్యాయులు కాడిశెట్టి స్వగృహంలో సత్కరించారు. అనంతరం కాడిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. ఉపాధ్యాయులు వేణుగోపాలరెడ్డి, గోపాల్, అమీర్‌వలి, చంద్రశేఖర్, నరేష్‌కుమార్, ఆనంద్, ఇర్ఫాన్, హనుమంతరాయుడు, బాబు, రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

హిందూపురం: బెంగళూరు జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేసి, పూర్తి వివరాలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. అలాగే సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రాత్రి పగలు పూర్తి స్థాయిలో నిఘా పెట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ జవహర్,సుధాకరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

పావగడ: అరసికెరె ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పుష్పార్చన చేశారు. జవహర్ లాల్ నెహ్రూ గురించి విద్యార్థులు ప్రసంగించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యకార్యక్రమాలు అందర్నీ అలరించాయి. క్రీడా పోటీల్లో విజేతల కు బహుమానాలు అందించారు. హెచ్ఎం రామచంద్రప్ప, సహోపాధ్యాయులు రేణుకారాజ్, ఉపాధ్యాయులు హనుమేశ్, ఎన్ కుమార్, విమల, రశ్మి, శ్రీ లక్ష్మి, ఎస్‌డీఎంసి అధ్యక్షుడు గురురాజ్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీరంగనాథ స్వామి ఊయలోత్సవం

అమరాపురం: పేలుబండ కొండలో వెలసిన లక్ష్మీ రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి ఊయలోత్సవం ఘనంగా జరిగింది. అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవ విగ్రహన్ని ఊయల్లో కూర్చొబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కృష్ణా జలాల కోసం కదం తొక్కిన రైతులు


ర్యాలీ నిర్వహిస్తున్న జలసాధన సమితి నాయకులు, రైతులు, వివిధ పార్టీల నేతలు

మడకశిర: శుక్రవారం కృష్ణా జలాల కోసం రైతులు కదం తొక్కారు. జలసాధన సమితి ఆధ్వర్యంలో రైతులు కృష్ణా జలాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మడకశిరలో ఆందోళన చేపట్టారు. కూటమి పార్టీలు మినహా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు రైతులకు సంఘీభావం ప్రకటించాయి. తొలుత జలసాధన సమితి నాయకుల ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జలసాధన సమితి నాయకులు మాట్లాడుతూ మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణా జలాలను వదలాలన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి కాకపోవడంతోనే నీటిని విడుదల చేయడానికి అటంకంగా మారిందన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు దాదాపు 20 చోట్ల గండ్లు పడినట్లు తెలిపారు. కెనాల్ మరమ్మతు పనులను పూర్తి చేసి మడకశిర,హిందూపురం,పెనుకొండ నియోజకవర్గాల్లోని చెరువులను పూర్తి స్థాయిలో నింపాలని కోరారు. అమరాపురం,అగళి హంద్రీనీవా మైనర్ కాలువల పూర్తికి దాదాపు రూ.70 కోట్ల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మడకశిర ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా కాలువ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. అనంతరం వారు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. జలసాధన సమితి ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి, మడకశిర నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, కార్యదర్శి సోమ్‌కుమార్, సభ్యులు నర్సేగౌడ్ ,రామకృష్ణారెడ్డి, నవీన్ ,రైతు సంఘం నాయకుడు రాచపల్లి సిద్దారెడ్డి, సీపీఐ కార్యదర్శి పవిత్ర, కాంగ్రెస్ కన్వీనర్ మంజునాథ్, మల్లికార్జున పాల్గొన్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి


హేమావతి పిహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న నాగేంద్ర నాయక్

అమరాపురం: గ్రామాల్లో వ్యాధులపై ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నాగేంద్రనాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం హేమావతి ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటా సర్వేపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధ్యు, డాక్టర్ జయకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం


మాట్లాడుతున్న డీఎఫ్ఓ చక్రపాణి

పెనుకొండ: కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరమని జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో ఎంఎస్ టైప్స్ అప్లికేషన్ల వినియోగంపై డీఎఫ్ఓ నేతృత్వంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సిబ్బంది ప్రాథమిక అంశాలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సబ్ డీఎఫ్ఓ జీవీ ఆనంద్, శ్రీశైలం బయోడైవర్సిటీ డీఎఫ్ఓ ధనరాజ్ కదిరి, పెనుకొండ, అటవీక్షేత్ర అధికారులు గుర్రప్ప, యామిని, రేంజర్ శ్రీనివాసరెడ్డి, సరస్వతి, డీఆర్ఓ శివరాం, హుస్సేనప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి


ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన భూ నిర్వాసితులు

పెనుకొండ రూరల్: ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని బెల్, నాసిన్ కంపెనీలకు భూములిచ్చిన రైతులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పెద్దన్న మాట్లాడుతూ మూడేళ్లుగా భూ నిర్వాసితులు అధికారులు చుట్టూ తిరిగినా కాలయాపన చేస్తున్నారన్నారు. హైకోర్టు ఇచ్చిన జాబితా కాకుండా, స్పష్టత లేని జాబితాను అధికారులు చూపించడం సరికాదన్నారు. తక్షణమే భూ సర్వే జరిపి ప్రతి రైతుకూ న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో నిరసనలు కొనసాగిస్తామన్నారు. నాయకులు గంగాధర్, స్వర్ణలత, నారాయణ, అంజనేయులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న వరి



రొద్దం: మండలంలోని కంచిసముద్రం, రాచూరు గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరి పంట దెబ్బతిన్నట్లు ఆయా గ్రామాల రైతులు శుక్రవారం తెలిపారు. కోత దశలో ఉన్న వరి పంటపై భారీ వర్షం పడడంతో మొత్తం వరి నేల వాలి నష్టం కలిగినట్లు తెలిపారు. కంచిసముద్రంలో రైతు రామాంజనమ్మకు సంబంధించిన 2 ఎకరాలు, రాచూరు యల్లారెడ్డికి సంబంధించిన ఎకరం వరి పంట నష్టపోయినట్లు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావు

రొళ్ల: బాలల హక్కుల పరిక్షణ మనందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు, ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం ఆవినకుంట కేజీబీవీ పాఠశాల ఆవరణలో ఆర్డీటీ, మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. తొలుత విద్యార్థులతో గ్రామ పువీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం ప్రయత్నిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1098 లేక 100 సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసం పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కేజీబీవీ ఎస్ఓ మున్వార్‌జాన్, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, ఏటీఎల్ ఓబుశేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సన్నమ్మ, లీలావతి, స్కూల్ కమిటీ సభ్యులు, అంగనవాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక సందడి

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి, కార్తీక దీపాలు వెలిగించారు. పలు ఆలయాల్లో జ్వాలా తోరణాలు వెలిగించారు. రొద్దంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేపట్టారు. పెనుకొండలోని కాశీ విశ్వేశ్వరుడుని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపారాధనలో భాగంగా హోమాలు, ప్రత్యేక పూజ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్:


పేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో జ్వాలా తోరణాన్ని వెలగించిన దృశ్యం


అమరాపురం: శివాలయంలో కార్తీక సందడి


పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్


సోమందేపల్లి: షిర్డీ సాయిబాబా ఆలయంలో దీపారాధన